ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

- రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి
- ప్రజావాణికి 92 ఫిర్యాదులు

కడ్తాల్ : కలెక్టర్ నారాయణరెడ్డికి సమస్యను వివరిస్తున్న మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, రైతులు

ఆదిబట్ల, డిసెంబర్ 23 : ప్రజావాణిలో వచ్చిన ప్రతి ఫిర్యాదును పరిశీలించి వెంటనే పరిష్కరించాలని రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌తో కలిసి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో 92 ఫిర్యాదులు రాగా.. అందులో రెవెన్యూ శాఖ 57, పీడీ హౌసింగ్ 19, డీపీవో 7, లోకల్ బాడీస్ 3, ఎంపీడీవో 1, శేరిలింగంపల్లి మున్సిపాలిటీ 1, ఏడీ సర్వే ల్యాండ్ 2, ఎంప్లాయ్‌మెంట్ 1, వైద్య ఆరోగ్య శాఖ 1 కలిపి మొత్తం 92 ఫిర్యాదులు వచ్చాయని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా, మున్సిపల్ అధికారులు, తహసీల్దార్లు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

హై టెన్షన్ విద్యుత్ లైన్‌తో తీవ్రనష్టం

కడ్తాల్ : మండల కేంద్రానికి అతి సమీపంగా వెళ్తున్న హైటెన్షన్ విద్యుత్ లైన్‌తో తీవ్రంగా నష్టపోతామని కడ్తాల్ గ్రామానికి చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ లైన్‌కు సంబంధించిన అలైన్‌మెంట్‌ను మార్చాలని కోరుతూ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ నారాయణరెడ్డిని రైతులు, నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. గతంలోనే కడ్తాల్ గ్రామ సమీపం నుంచి 220/400/765 కేవీ సాంద్రత కలిగిన హై టెన్షన్ విద్యుత్ లైన్లు వెళ్లడంతో రైతులు నష్టపోయారని తెలిపారు. ప్రస్తుతం బీదర్ నుంచి మహేశ్వరం పవర్ గ్రిడ్ ట్రాన్సిమిషన్ ఏర్పాటు చేస్తున్న నూతన 765 కేవీ విద్యుత్ లైన్‌తో పూర్తిగా నష్టపోతామని రైతులు తమ గోడును కలెక్టర్‌కు వినిపించారు. విద్యుత్ లైన్ ఏర్పాటుకు సంబంధించిన అధికారులు, కాంట్రాక్టర్లు రైతులకు ముందుస్తు సమాచారం ఇవ్వకుండా, విద్యుత్ చట్టం-2003 ప్రామాణికాలను పాటించకుండా రైతులను భయభ్రాంతులకు గురి చేస్తూ ఇబ్బందులు పెడుతున్నారని విన్నవించారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ విద్యుత్ ఎస్ఈ, పవర్ గ్రిడ్ వారితో మాట్లాడి రైతులను ఆదుకునేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు మాజీ సర్పంచ్ ఎల్ఎన్ రెడ్డి తెలిపారు. కలెక్టర్‌ను కలిసినవారిలో సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ ఉప సర్పంచ్‌లు ఉన్నారు.

సామూహిక ధ్యానంతో అద్భుత ఫలితాలు

పీఎస్ఎస్ఎం గ్లోబల్ వ్యవస్థాపకురాలు పరిణతి పత్రీ

ధ్యాన మహాయాగం ఆధ్యాత్మిక పుస్తకాలను ఆవిష్కరిస్తున్న పరిణతి పత్రీ తదితరులు

కడ్తాల్, డిసెంబర్ 23 : సామూహిక ధ్యానంతో అద్భుత ఫలితాలు సాధించవచ్చని, ధ్యాన గురువు సుభాశ్ పత్రీజీ ఆశయ సాధనకు ప్రతి ధ్యానీ కృషి చేయాలని పీఎస్ఎస్ఎం గ్లోబల్ వ్యవస్థాపకురాలు పరిణతి పత్రీ అన్నారు. మండల కేంద్రం సమీపంలోని మహేశ్వర మహా పిరమిడ్‌లో జరుగుతున్న పత్రీజీ ధ్యాన మహాయాగం-3 ఉత్సవాలు కొనసాగుతున్నాయి. సోమవారం ఉదయం 5 గంటల నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ప్రాతఃకాల సంగీత ధ్యానంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ధ్యానులు పాల్గొన్నారు. పిరమిడ్ మాస్టర్ ఓయూ రాము, క్వాంటమ్ లైఫ్ యూనివర్సిటీ పవన్, గురుస్థాన్ వ్యవసాపకుడు నాగేంద్ర మాట్లాడుతూ.. యువత దురలవాట్లకు లోనై చిన్న చిన్న సమస్యలకే ఆత్మహత్యలకు పాల్పడుతుండటం ఆందోళన కలిగిస్తున్నదని తెలిపారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మికవేత్తల ధ్యాన సందేశాలు, పిరమిడ్ మాస్టర్లు తమ అనుభవాలను వివరించారు. ధ్యాన మహాసభలకు వచ్చే ధ్యానులకు అన్ని రకాల వసతులు కల్పిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం కళాకారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ధ్యానులను అలరించాయి. అనంతరం ఆధ్యాత్మిక పుస్తకాలను ట్రస్ట్ సభ్యులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

మహా యాగం-3లో కళాకారుల నృత్య ప్రదర్శన

ఆకట్టుకున్న గణిత ప్రదర్శన

విద్యార్థులను అభినందించిన డీఈవో రేణుకాదేవి

విద్యార్థుల గణిత ప్రదర్శనను తిలకిస్తున్న డీఈవో రేణుకాదేవి, ఉపాధ్యాయులు

వికారాబాద్, డిసెంబర్ 23 : ప్రపంచ ప్రఖ్యాత గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని సోమవారం వికారాబాద్‌లోని బచ్‌పన్ పాఠశాలలో జామెట్రీ పార్క్, ఫ్రాక్షన్, మ్యాజిక్ బోర్డ్, మెమొరీ గేమ్స్, మ్యాప్ స్టాల్, ఎల్‌సీఎం, 9 టేబుల్ విత్ ఫింగర్స్, ప్రైమ్ నంబర్ గేమ్ వంటి విభిన్న కాన్సెప్ట్‌లతో విద్యార్థులు గణిత ప్రదర్శన నిర్వహించారు. డీఈవో రేణుకాదేవి ప్రదర్శనను తిలకించి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఎక్కడ ఏ పరిశోధనలకైనా గణితమే ప్రాతినిధ్యం వహిస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులంతా రామానుజన్‌ను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ రాజ్యలక్ష్మి, పాఠశాల ప్రిన్సిపాల్ శ్వేతాప్రశాంతి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైద్యుడిపై పోలీసులకు ఫిర్యాదు

పరిగి, డిసెంబర్ 23 : దోమ మండలం దిర్సంపల్లి గ్రామానికి చెందిన చాకలి మహేశ్వరికి ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. 6 సంవత్సరాల వయసు గల కుమార్తెకు గత రెండు సంవత్సరాలుగా తరచుగా జ్వరం వస్తుండడంతో పరిగిలోని శ్రీ బాలాజీ ఆసుపత్రిలో డాక్టర్ అభినవ్ నీలాకు చూపించగా ప్రతిసారి బ్లడ్ ఇన్‌ఫెక్షన్, వైరల్ ఫీవర్ అని చెబుతూ, ఎలాంటి పరీక్షలు జరిపించకుండానే వైద్యం చేశాడన్నారు. ఇటీవల పాపకు సీరియస్ కావడంతో హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రికి తీసుకువెళ్లగా వైద్య పరీక్షలు నిర్వహించి పాప గుండెలో నాలుగు బ్లాక్స్ డ్యామేజ్ అయినట్లు చెప్పారని తల్లి పేర్కొన్నారు. దీనంతటికి కారణం గత ఎనిమిది నెలలుగా చికిత్స చేస్తున్న వైద్యుడు అభినవ్ నీలా కారణమంటూ సోమవారం సాయంత్రం ఆసుపత్రిలో వైద్యులను ఆమె నిలదీసింది. అనంతరం వైద్యుడిపై చర్యలు తీసుకోవాల్సిందిగా ఆమె పరిగి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కీచక ఉపాధ్యాయుడిపై చర్యలేవి..?

- సంఘటన జరిగి 15 రోజులైనా అదుపులోకి తీసుకోని వైనం
- పోలీసులు కావాలనే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తుల ఆగ్రహం

ధారూరు, డిసెంబర్ 23 : పవిత్రమైన వృత్తిలో ఉండి, ఉపాధ్యాయ వృతికే కళంకం తెచ్చిన కీచక ఉపాధ్యాయుడు కిష్టయ్యపై చర్యలేవని, సంఘటన జరిగి 15 రోజులవుతున్నా పోలీసులు కావాలనే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కిష్టయ్యను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. విద్యాశాఖ తక్షణమే చర్యలు తీసుకోవాలని, పోలీసు అధికారులు వెంటనే అరెస్టు చేయాలన్నారు. కిష్టయ్యను అరెస్టు చేయకపోవడానికి ప్రజాప్రతినిధులు, బడా నాయకుల హస్తం ఉందని, అందుకే అరెస్టు చేయలేకపోతున్నారని వారు విమర్శించారు.

గడువులోపు సర్వే పూర్తి చేయాలి

- జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్
- ప్రజావాణికి 114 దరఖాస్తులు

ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్లు

వికారాబాద్, డిసెంబర్ 23 : ప్రజావాణి దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశం హాలులో జరిగిన ప్రజావాణిలో వినతులు, ఫిర్యాదులను జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్, ఆర్డీవో వాసుచంద్రలతో కలిసి స్వీకరించారు. ప్రజావాణిలో 114 దరఖాస్తులు రాగా.. భూ సమస్యలు, ఇతర సమస్యలకు సంబంధించి ఉన్నాయని పేర్కొన్నారు. అర్జీలను సంబంధిత శాఖ అధికారులకు పంపించి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దరఖాస్తులను సాధ్యమైనంత త్వరగా పరిశీలించి తమ పరిధిలో ఉంటే వెంటనే పరిష్కరించాలని, లేకపోతే వారికి తగిన సూచనలు ఇవ్వాల్సిందిగా అధికారులకు సూచించారు. అనంతరం జిల్లా అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద అర్హులైన లబ్ధిదారుల గుర్తింపు కోసం జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీలు, మున్సిపల్ డివిజన్లు, వార్డుల్లో క్షేత్రస్థాయిలో చేపట్టే సర్వే ప్రక్రియను ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరిస్తూ పూర్తి పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ఈ నెల చివరి వరకు పూర్తి చేయాలని స్పెషల్ అధికారులను ఆదేశించారు. ప్రజాపాలన కార్యక్రమం సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తులు చేసుకున్న వారి ఇండ్లకు వెళ్లి.. వారు ఇచ్చిన వివరాలను పరిశీలించి.. మొబైల్ యాప్‌లో పొందుపర్చాలన్నారు. ఎలాంటి వివాదాలు, అవకతవకలకు తావులేకుండా సర్వే ప్రక్రియను నిజాయితీగా, నిబద్ధతతో చేపడుతూ గడువులోపు పూర్తిచేయాలన్నారు.

కడ్తాల్ మండలాన్ని సోమవారం ఉదయం మంచు దుప్పటి కమ్మేసింది. పొగమంచుతో పది మీటర్ల వరకు ముందు ఏముందో కనిపించలేదు. ఉదయం తొమ్మిది గంటల వరకు పొగమంచు ఉండటంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. హైదరాబాద్-శ్రీశైలం

జాతీయ రహదారిపై వాహనదారులు లైట్లు వేసుకొని రాకపోకలు కొనసాగించారు. చలి తీవ్రతతో ఉదయం, రాత్రివేళ్లలో ప్రజలు ఇండ్ల నుంచి బయటకు రావడానికి భయపడుతున్నారు. - కడ్తాల్, డిసెంబర్ 23

చేగూరులో చిరు వ్యాపారాన్ని ప్రారంభిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

నందిగామ, డిసెంబర్ 23 : రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఇందిరా మహిళ శక్తి కార్యక్రమంలో భాగంగా మండలంలోని చేగూరు, అంతిరెడ్డిగూడ గ్రామాల్లో మహిళలు వివిధ రకాల జీవనోపాధులు పొందేందుకు ఏర్పాటు చేసిన చిరు వ్యాపారాలను సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. మహిళా సంఘాలకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో, డీఆర్‌డీఏ అధికారులు శ్రీలత, సూర్యారావు, డీపీఎం బాలరాజ్, ఏపీఎం యాదగిరి, సీసీలు అరుణ, రజని పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల్లోనే కంపెనీలు ఏర్పాటు చేయాలి

- మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ
- లగచర్ల, రోటిబండతండాలో పర్యటించి బాధితులకు పరామర్శ


లగచర్లలో బాధితుల కుటుంబ సభ్యులనుద్దేశించి మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ

కొడంగల్, డిసెంబర్ 23 : అభివృద్ధి పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి పేద రైతుల భూములను లాక్కొని ప్రైవేటు కంపెనీలకు ధారాదత్తం చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ ఆరోపించారు. సోమవారం దుద్యాల మండలంలోని లగచెర్ల, రోటిబండతండాలో ఎంపీ పర్యటించి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా నిలుస్తామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అభివృద్ధి చేయాలనే సంకల్పముంటే పట్టా భూములు కాకుండా ప్రభుత్వ భూములను ఎంచుకోవాలని తెలిపారు. దౌర్జన్యంగా కాకుండా ప్రజాభీష్టం మేరకు భూ సేకరణ చేపట్టాలి కానీ పేద రైతులను భయపెట్టి భూములు లాక్కొవడం దారుణమని పేర్కొన్నారు. ఎటువంటి అధికారం లేని తిరుపతి రెడ్డిని లగచెర్లలో తిరగనిచ్చారు, ఎంపీగా నా పరిధిలోని ప్రజలను పరామర్శించండంలో తప్పేంటని ప్రశ్నించారు. ఫార్మా వంటి కాలుష్య కంపెనీలు కాకుండా ప్రజాభ్యున్నతికి పాటుపడే కంపెనీలను ఏర్పాటు చేసి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించాలన్నారు. 57 మందిలో ప్రస్తుతం 24 మంది మాత్రమే బెయిల్‌పై బయటకు రావడం జరిగిందని, మిగతావారికీ బెయిల్ మంజూరయ్యేలా పూర్తి సహకారముంటుందని బాధిత కుటుంబాలకు భరోసా కల్పించారు.

సినీ హీరో అల్లు అర్జున్ ఇంటిపై దాడి చేయడంలో కాంగ్రెస్ కుట్ర ఉందని స్పష్టం అవుతున్నదన్నారు. కొడంగల్ నియోజకవర్గ ప్రాంతానికి చెందిన నలుగురు దాడిలో పాల్గొన్నట్లు తెలిపారు. అందులో 2019లో దౌల్తాబాద్ నుంచి జడ్పీటీసీగా పోటీ చేసిన రెడ్డిశ్రీను కూడా ఉన్నట్లు తెలిపారు. ఏదిఏ మైనా అర్జున్ ఇంటిపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నారాయణపేట జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి రమేశ్ పాల్గొన్నారు.

మహా సభలను విజయవంతం చేయాలి

కందుకూరు, డిసెంబర్ 23 : విద్యా, వైజ్ఞానిక మహా సభలను విజయవంతం చేయాలని టీఎస్ యూటీఎఫ్ రంగారెడ్డి అధ్యక్షుడు గోపాల్ నాయక్ కోరారు. సోమవారం సాయంత్రం కందుకూరు జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర 6వ మహాసభలు ఈ నెల 28 నుంచి 30 వరకు నల్గొండలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు, విశ్లేషకులు పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

టీజీసీటీఏ ఎన్నికల్లో బ్రిజేశ్ ప్యానల్ ఘన విజయం

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 23 : తెలంగాణ డిగ్రీ కాలేజ్ టీచర్స్ అసోసియేషన్ (టీజీసీటీఏ) ఎన్నికల్లో బ్రిజేశ్ ప్యానల్ ఘన విజయం సాధించింది. ఓయూ ఫ్యాకల్టీ క్లబ్‌లో నిర్వహించిన ఎన్నికల్లో డాక్టర్ ఇ.బ్రిజేశ్ ప్రధాన కార్యదర్శిగా రెండోసారి విజయం సాధించారు. అధ్యక్షుడిగా డాక్టర్ బి.శ్రీనివాస్‌గౌడ్, చైర్మన్‌గా డాక్టర్ సౌందర్య జోసెఫ్, మహిళా కార్యదర్శిగా డాక్టర్ ఎం.భవాని, అకాడమిక్ కార్యదర్శిగా డాక్టర్ గోపాల సుదర్శనం, ఆర్థిక కార్యదర్శిగా డాక్టర్ గంగాధర్, ఉపాధ్యక్షులుగా మల్టీజోన్ 1 నుంచి డాక్టర్ ఆడెపు రమేశ్, మల్టీజోన్ 2 నుంచి డాక్టర్ జీఎన్ జగన్, కార్యదర్శిగా మల్టీజోన్ 1 నుంచి డాక్టర్ ఎస్.హరీశ్‌కుమార్, మల్టీజోన్ 2 నుంచి డాక్టర్ ఎం.రామాచారి, ఓయూ కార్యదర్శిగా డాక్టర్ రాకేశ్ భవాని, కేయూ కార్యదర్శిగా డాక్టర్ సమ్మయ్య, మహాత్మాగాంధీ వర్సిటీ కార్యదర్శిగా డాక్టర్ యాదయ్య, పాలమూరు యూనివర్సిటీ కార్యదర్శిగా డాక్టర్ పి.రాములు, శాతవాహన వర్సిటీ కార్యదర్శిగా డాక్టర్ రాజేశ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ బ్రిజేశ్ మాట్లాడుతూ డిగ్రీ లెక్చరర్ల సమస్యలపై పోరాడుతామన్నారు. ఉన్నత విద్యాశాఖలో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు భర్తీ చేసేందుకు ప్రభుత్వం ఒత్తిడి తీసుకువస్తామని చెప్పారు. విద్యార్థుల ప్రవేశాలను పెంచేందుకు వివిధ కార్యక్రమాల ద్వారా ఉన్నత విద్య అభివృద్ధి కోసం పాటుపడతామన్నారు.

ఆదాయం నిల్.. అప్పులు ఫుల్

ఆస్తి పన్ను, ట్రేడ్ లైసెన్స్‌ల వసూళ్ల పెంపుపై మారని అధికారుల వైఖరి

రూ.8440 కోట్ల బడ్జెట్‌కు స్టాండింగ్ కమిటీ ఆమోదం

సిటీబ్యూరో, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ): 2025-26 ఆర్థిక సంవత్సరానికి జీహెచ్ఎంసీ రూ.8,440 కోట్లతో ప్రవేశపెట్టిన బడ్జెట్ అంచనా ప్రతిపాదనలను సోమవారం జరిగిన ప్రత్యేక బడ్జెట్ సమావేశంలో స్టాండింగ్ కమిటీ ఆమోదించింది. మేయర్ విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన ప్రత్యేక బడ్జెట్ సమావేశానికి జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి, స్టాండింగ్ కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు. కాగా గత స్టాండింగ్ కమిటీ సమావేశంలో అభ్యంతరాలు వ్యక్తం చేయడం, బడ్జెట్ పారదర్శకంగా ఉండాలని సభ్యుల సూచనల మేరకు మార్పులు చేశారు. రూ. 8340 కోట్లతో రూపొందించిన బడ్జెట్‌ను.. సభ్యుల సూచనల మేరకు రూ. 100కోట్ల మేరకు పెంచి రూ.8440కోట్లు సవరణ బడ్జెట్‌గా ఆమోదించారు. పెంపులో భాగంగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి టౌన్‌ప్లానింగ్ ఆదాయం రూ. 1,595.62కోట్లు అంచనా వేయగా, సవరణ బడ్జెట్‌లో దానిని రూ.938.96 కోట్లకు తగ్గించారు. మొదటి ఆరు నెలల్లో వచ్చిన ఆదాయం రూ. 425కోట్లు మాత్రమే. దీనిని బట్టి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ. 900కోట్ల ఆదాయం సమకూరడం కష్టసాధ్యంగా మారింది. ఈ పరిస్థితుల్లో ఏకంగా రూ. 1,201 కోట్ల ఆదాయం వస్తుందని రెవెన్యూ విభాగం అంచనా వేయడం గమనార్హం. ట్రేడ్ లైసెన్స్ ఆదాయం రూ. 92 కోట్ల నుంచి రూ.112 కోట్లకు పెంచి చూపించారు. కాగా వచ్చే ఏడాదిలో రూ.700 కోట్ల అప్పులు తీసుకురావాలని బడ్జెట్‌లో చూపించడం విశేషం. అయితే బడ్జెట్‌లో అభివృద్ధి పనులపై సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేయడం, ఎన్నికల ఏడాది బడ్జెట్‌పై సభ్యులు పెదవి విరిచినా మేయర్ మాత్రం ఆమోదించేందుకు మొగ్గు చూపడం పట్ల పలు విమర్శలు వినిపిస్తున్నాయి.



బడ్జెట్ స్వరూపం.. (రూ.కోట్లలో)

వచ్చే ఏడాది జనవరి 10వ తేదీలోపు జనరల్ బాడి మీటింగ్‌లో సభ్యుల ముందు బడ్జెట్‌పై చర్చ పెట్టి ఆమోద ముద్ర పొందాల్సి ఉంటుంది. మార్పులు, చేర్పుల అనంతరం ఫిబ్రవరి 20లోపు అంచనాలను మంజూరు చేయాల్సి ఉంటుందని చట్టం చెబుతున్నది. మార్చి 1లోపు కార్పొరేషన్ బడ్జెట్ అంచనాల సమాచారాన్ని ప్రభుత్వానికి తెలియజేయాల్సి ఉంటుంది. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు విరుద్ధంగా కనబడుతుండటం గమనార్హం.

కేటాయింపులు ఇలా..

హెచ్ సిటీ ప్రాజెక్టులకు రూ.1237 కోట్లు, రహదారులకు రూ. 650 కోట్లు, సమగ్ర రోడ్డు నిర్వహణకు రూ.185కోట్లు, నాలాలు, డ్రైయిన్లు రూ.200కోట్లు పార్కులు, పచ్చదనంకు రూ. 208 కోట్లు, చెరువులు, వారసత్వ కట్టడాల పరిరక్షణకు రూ. 173 కోట్లు, అప్పులు రూ.1933కోట్లు, ఇంకుడు గుంతలకు రూ.72కోట్లు, ఇంజినీరింగ్ నిర్వహణ పనులకు రూ.314,హెల్త్ శానిటేషన్ విభాగానికి రూ.600కోట్లు కేటాయింపులు జరిపారు. కాగా హౌజింగ్‌కు రూ.300కోట్లు కేటాయింపులు జరిపారు.

☞ రెవెన్యూ వ్యయంలో రూ. 64 కోట్లు, క్యాపిటల్ వ్యయంలో రూ.36 కోట్లు పెంచి సవరణ బడ్జెట్‌ను రూ.100కోట్లు పెంచారు. సవరణలో భాగంగా ఆస్తిపన్ను, టౌన్‌ప్లానింగ్, ట్రేడ్ లైసెన్స్, ప్రకటనలు ఫీజుల ద్వారా దాదాపు రూ.228 కోట్లు ఆదాయం అదనంగా చూపారు. కేంద్ర ప్రభుత్వ గ్రాంట్లను రూ.419 కోట్ల నుంచి రూ.279 కోట్లకు తగ్గించారు. కూడికలు, తీసివేతలతో మొత్తంగా రూ.100కోట్లు పెంచారు.

మధ్యాహ్న భోజన పరిశీలన


తుమ్మలూరు పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

బడంగ్‌పేట, డిసెంబర్23: మహేశ్వరం నియోజకవర్గం వ్యాప్తంగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సోమవారం సుడిగాలి పర్యటన చేశారు. మహేశ్వరం మండలంలోని తుమ్మలూరులో ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. లెనిన్‌నగర్‌లో బస్తీవాసులతో కూర్చొని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పేద ప్రజలకు అవసరమైన వాటిని త్వరగా పూర్తి చేయించాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ విక్రంరెడ్డి, కమిషనర్ జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.